క్లుప్తంగా

పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెంలో గ్రామదేవత పోలేరమ్మ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సిద్ధాంతి గోనుగంటి బ్రహ్మానందశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు పోలేరమ్మ, అంకమ్మ ఆలయాల నిర్మాణాలకు శాస్త్రోక్తంగా శంకుస్థాపన చేశారు. భక్తులు నవధాన్యాలు, తదితర పూజాసామగ్రి సమర్పించారు.

అభయాంజనేయుని విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ



కలిగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమీపంలో అభయాంజనేయస్వామి విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. గతంలో ఇక్కడ ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని హైవే విస్తరణ పనుల్లో భాగంగా తొలగిస్తున్న నేపథ్యంలో నూతనంగా మరో విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు భూమి పూజ చేపట్టారు.

దివ్యాంగ బాలుడికి వీల్‌చైర్ వితరణ



ఆత్మకూరు: పట్టణంలోని 17వ వార్డు టెక్కే ప్రాంతానికి చెందిన దివ్యాంగ బాలుడు మణికంఠకు సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వరరెడ్డి వీల్‌చైర్‌ను వితరణ చేశారు. ఆదివారం పట్టణంలోని ట్రస్టు కార్యాలయంలో దివ్యాంగ బాలుడికి వీల్‌చైర్‌ను అందజేశారు. దాతకు బాలుడు మణికంఠ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాంపల్లి ప్రసాద్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అంకాలమ్మకు పొంగళ్లు



విశేషాలంకారంలో అంకాలమ్మ

ఉదయగిరి: మండలంలోని జి.చెరువుపల్లెలో గ్రామదేవత అంకాలమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. మహిళలు పొంగళ్ల సామగ్రిని కొత్తబుట్టల్లో ఉంచుకుని డప్పు వాయిద్యాల మధ్యన ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేసి పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు.

వరికుంటపాడు: మండలంలోని రామాపురంలో గ్రామదేవతలు అంకాలమ్మ, పోలేరమ్మకు పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామంలోని మహిళలు సామూహికంగా పొంగళ్ల సామగ్రితో ఆలయం వద్దకు చేరుకుని నైవేద్యాలు సమర్పించారు.

షైనింగ్‌స్టార్స్ అవార్డులకు విద్యార్థుల ఎంపిక

అనుమసముద్రంపేట: మండలంలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఏడుగురు విద్యార్థులను షైనింగ్ స్టార్స్–2025 అవార్డులకు ఎంపిక చేసినట్లు ఠాగూర్ పాఠశాల కరస్పాండెంట్లు సీహెచ్ వెంకటరమణారెడ్డి, కే దొరస్వామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏఎస్‌పేట ఠాగూర్ పాఠశాలకు చెందిన ఎండీ అప్సా, జే మధులేఖ, ఎం హానీప్రియ, శ్రీకొలను ఉన్నత పాఠశాలకు చెందిన మోరం లక్ష్మి, చేజర్ల వైష్ణవి, కావలియడవల్లి ఉన్నత పాఠశాలకు చెందిన ముప్పూరి వర్షిత, గుడిపాడు ఉన్నత పాఠశాలకు చెందిన పాలకీర్తి ప్రత్యూషను అవార్డులకు ఎంపిక చేసినట్లు వివరించారు.

పోలేరమ్మకు పొంగళ్లు

కొండాపురం: మండలంలోని కొమ్మిలో గ్రామదేవత పోలేరమ్మకు సామూహిక పొంగళ్ల కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పొంగళ్ల సామగ్రితో ఊరేగింపుగా గ్రామశివారులోని పోలేరమ్మ ఆలయం వద్దకు చేరుకుని పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. పాడిపంటలతో గ్రామం సుభిక్షంగా ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ఈ సందర్భంగా కుమ్మర కులస్తులు పొంగళ్లకు బొల్లి ఆవులు, వీరతాళ్లతో తరలివచ్చారు.

సమస్యలకు నెలవుగా విద్యుత్ సబ్‌స్టేషన్



ప్రహరీ లేని హసనాపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

అనుమసముద్రంపేట: మండలంలోని హసనాపురంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ సమస్యలకు నెలవుగా మారింది. శ్రీకొలను, కావలియడవల్లి, అక్బరాబాదు, చిరమన ప్రాంతాలకు విద్యుత్‌ను సరఫరా చేసేందుకు హసనాపురంలో సుమారు 30 ఏళ్ల క్రితం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు సబ్‌స్టేషన్ చుట్టూ ప్రహరీని నిర్మించలేదు. ట్రాన్స్‌ఫార్మర్లు ఉండే చోట కూడా కనీసం రక్షణ కంచె కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో స్థానికులు సబ్‌స్టేషన్ మీదుగా అటుఇటు రాకపోకలు సాగిస్తున్నారు. రాత్రి వేళల్లో మద్యం ప్రియులు మద్యంమత్తులో సబ్‌స్టేషన్‌లోని ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు సబ్‌స్టేషన్ చుట్టూ పిచ్చిచెట్లు ఉండడంతో విషసర్పాలు సైతం లోనికి వస్తున్నాయి. దీంతో విద్యుత్ సిబ్బంది భయాందోళనలు చెందుతున్నారు. దాదాపు 30 ఏళ్లుగా సబ్‌స్టేషన్ రక్షణను విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి సబ్‌స్టేషన్ చుట్టూ ప్రహరీ, ట్రాన్స్‌ఫార్మర్లు ఉండే ప్రాంతంలో రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అంచనాలు ఇంకా వేయలేదు

జిల్లా ఇంజనీర్ల చేతుల్లోనే ప్రహరీ నిర్మాణం ఉంటుంది. సబ్‌స్టేషన్‌ను ఇంజనీర్లు వచ్చి చూసి వెళ్తున్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి అంచనాలు వేయలేదు. ఇప్పటికే రక్షణ కంచె విషయాన్ని జిల్లా విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి సైతం తీసుకెళ్లాం.

–నిరంజన్, ఏఈ

వైభవంగా అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

ఉదయగిరి రూరల్: మండలంలోని గన్నేపల్లి పంచాయతీలో కొలువైన అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, కలశస్థాపన, అభిషేకాలు, విశేషపూజలు, ధ్వజారోహణం, కుంకుమార్చన ,తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పాలాయులను పంచాయతీలోని మిట్టపల్లె నుంచి గద్దంవారిపల్లె రామాలయానికి చేర్చి పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేక వాహనంలో ఆశీనులను చేసి కొమ్ము, డప్పు వాయిద్యాలు, మేళతాళాల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చి కొలువుదీర్చారు. ఐదు రోజులపాటు ఉత్సవాలను నిర్వహించనున్నట్లు, భక్తులకు ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయ చైర్మన్ పులుగుళ్ల రవీంద్ర తెలిపారు.



బంగారు కాసులపేరుకు పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

బంగారు కాసులపేరు బహూకరణ

అడవి పేరంటాలమ్మకు గన్నేపల్లి పంచాయతీ గ్రామ ప్రజలు 176 గ్రాముల నూతన బంగారుకాసులపేరును ఆదివారం బహూకరించారు. వేదపండితులు బంగారుకాసుల పేరుకు విశేష పూజలు నిర్వహించి అమ్మవారికి అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

మర్రిపాడు: మండలంలోని నాగరాజుపాడులో నూతనంగా నిర్మించిన రామమందిరం, తిమ్మయ్య మందిరంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ సీనియర్ నాయకులు గూటూరు కన్నబాబు, మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, ఆత్మకూరు ఏఎంసీ చైర్మన్ ఆరికట్ల జనార్దన్‌నాయుడు, దేవరాల గంగాధర్‌యాదవ్, భీమవరం సొసైటీ మాజీ చైర్మన్ యర్రమళ్ల చిన్నారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వేమిరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో త్వరలో వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా ఉచిత కంటి వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని నాగరాజుపాడు గ్రామం నుంచే ప్రారంభిస్తామన్నారు. గ్రామంలో మినీకల్యాణ మండపాన్ని నిర్మిస్తామని హామీ ఇచ్చారు.

శిథిలావస్థకు చేరిన జలవనరుల శాఖ భవనాలు



పిచ్చిమొక్కలతో చిట్టడవిని తలపిస్తున్న భవనం

ఉదయగిరి రూరల్: గండిపాళెంలోని పొన్నెబోయిన చెంచురామయ్య జలాశయానికి సంబంధించిన భవనాలు ఆలనా పాలనా కరువై శిథిలావస్థకు చేరాయి. జలాశయాన్ని నిర్మించే సమయంలో అక్కడ పనిచేసే సిబ్బంది కోసం భవనాలు నిర్మించారు. నిర్మాణ సమయంలో సిబ్బంది ఎక్కువగా ఉండడంతో అక్కడే నివాసాలు ఉండేవారు. కాలక్రమేణా సిబ్బంది ఉద్యోగ విరమణ చేయడం తిరిగి నియామకాలు చేపట్టకపోవడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకుని అసాంఘిక కార్యకలాపాలకు నెలవుగా మారాయి. మరోవైపు కొన్ని భవనాల తలుపులు, కిటికీలు సైతం చోరీకి గురయ్యాయి. కొన్ని భవనాల్లో మూగజీవాలు సేదతీరుతున్నాయి. కొన్ని భవనాల ప్రాంగణంలో ఏపుగా కంపచెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి.



శిథిలావస్థకు చేరిన భవన సముదాయం

అపరిశుభ్రంగా కలిగిరి బస్టాండ్



మండల కేంద్రమైన కలిగిరిలోని పంచాయతీ బస్టాండ్ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అపరిశుభ్రంగా మారింది. బస్టాండ్ ముందు భాగం ఆక్రమణకు గురైంది. బస్టాండ్ ప్రాంగణంలో చిన్నచిన్న గుంతలు ఏర్పడి చిన్న వర్షం పడిన నీరు నిల్వ ఉండి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. బస్టాండ్ లోపల, వెలుపల అపరిశుభ్రంగా తయారవడంతో ప్రయాణికులు వేచి ఉండలేని పరిస్థితి నెలకొంది.గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బస్టాండ్ ఎంతో శుభ్రంగా ఉండేది.ప్రయాణికులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేది.కానీ ఇప్పుడు పూర్తిగా భిన్నమైన పరిస్థితి నెలకొంది. బస్టాండ్‌పై పంచాయతీ పాలకులు దృష్టి సారించి పారిశుధ్యాన్ని మెరుగుపరిచి సౌకర్యాలు కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– ఉదయగిరి

గంగాభవాని తిరునాళ్ల ప్రారంభం



వరికుంటపాడు: మండలంలోని వేంపాడు పంచాయతీ పరిధిలోని వెంగమాంబపురంలో కొలువైన గంగాభవాని తిరునాళ్ల ఆదివారం ప్రారంభమైంది.తొలిరోజు ఉదయం 9 గంటలకు నిలుపు, కుంభబలి, జలాధి స్నానం, విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పోలీసుస్టేషన్లకు నూతన వాహనాల అందజేత




ఆత్మకూరు: ఆత్మకూరు నియోజకవర్గంలోని ఆరు మండలాల పోలీసు స్టేషన్లకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి దాతల సహకారంతో వాహనాలను సమకూర్చారు. ఆదివారం నెల్లూరులో జరిగిన దివంగత మంత్రి ఆనం వెంకటరెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా వాహనాల నమూనా తాళాలను అందజేశారు. ఆత్మకూరు డీఎస్పీ కే వేణుగోపాల్, సీఐ జీ గంగాధర్, అన్ని పోలీసు స్టేషన్ల ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



సోమశిల: మండల కేంద్రమైన అనంతసాగరంలోని గ్రంథాలయంలో 40 రోజుల పాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. చివరిరోజు అనంతసాగరం ఎంఈఓ–2 ప్రభాకర్ రెడ్డి, టీజీఎస్ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం విజయలక్ష్మి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రతిభా పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఎంఈఓ, హెచ్‌ఎంను గ్రంథాలయాధికారి నారాయణరావు సన్మానించారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



ఆత్మకూరు: పట్టణంలోని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. చివరిరోజు క్విజ్, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్స్, స్టోరీ టెల్లింగ్, తదితర అంశాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు పోటీలను నిర్వహించారు. విజేతలకు గ్రంథాలయాధికారి శ్రీనివాసరాజు బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు వెంకట సుబ్బయ్య, విశ్రాంత లైబ్రేరియన్ గోవిందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సాగునీరు అందించాలని వినతి

చేజర్ల(ఆత్మకూరు): చేజర్ల మండలం సోమశిల దక్షిణ కాలువ చీలు కాలువలైన 23 ఎల్, 24ఎల్ కాలువలకు సాగునీరు సక్రమంగా అందడంలేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సాగుకు నార్లు పోసుకుని దుక్కులు చేసుకునే పనిలో నిమగ్నమై ఉన్నారు. అయితే దక్షిణకాలువకు సాగునీరు సమృద్ధిగా విడుదల చేయకపోవడంతో 23ఎల్, 24ఎల్ కాలువలకు సాగునీరు అందడం లేదు. మరోరెండ్రోజులు సాగునీరు అందకపోతే నారుమడులు ఎండిపోయే పరిస్థితి నెలకొంటుందని బోడిపాడు, తిమ్మాయిపాళెం గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు స్పందించి సాగునీరు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



సరస్వతీదేవిగా ఆత్మారాముడు



సంగం మండలం అన్నారెడ్డిపాళెంలోని ఆత్మారామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి స్వామివారు సరస్వతీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి ఆత్మరాముడిని సరస్వతీదేవిగా అలంకరించి హంసవాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– సంగం

సోమేశ్వరాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

సోమశిల:అనంతసాగరం మండలం సోమశిలలోని కామాక్షి సమేత సోమేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణానికి దేవదాయశాఖ ఆధ్వర్యంలో భూమి పూజ కార్యక్రమాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ కనుమల్ల సత్యనారాయణశర్మ, ఆలయ ప్రధానాలు రామకృష్ణశర్మ పర్యవేక్షణలో శివాలయ ప్రాంగణంలో వంశపారంపర్య ధర్మకర్తలు ఉప్పల సోమసుందర్‌మూర్తి, ఉప్పల విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఐదు అడుగుల గుంతలో శివలింగాన్ని ప్రతిష్ఠించి భూమి పూజ చేశారు. శివాలయ నిర్మాణానికి ప్రతిష్ఠించనున్న స్థూపాలకు పూజలు నిర్వహించారు. దేవదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సీహెచ్ శ్రీనివాసులు, ఏఈ మురళి, స్థపతి పీ సురేంద్ర, ఆలయ ఈఓ ప్రసాద్‌రెడ్డి,సెక్షన్ ఆఫీసర్ గుమ్మడి రవీంద్ర భక్తులు పాల్గొన్నారు.



నేడు యోగాంధ్రపై ర్యాలీ

ఆత్మకూరు: పట్టణంలో యోగాంధ్రపై అవగాహన ర్యాలీని సోమవారం ఉదయం 8 గంటలకు నిర్వహించినట్లు మున్సిపల్ కమిషనర్ జీ గంగా ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యానికి యోగా సాధనను తప్పనిసరిగా చేయాలని వివరిస్తూ మున్సిపల్ కార్యాలయం నుంచి మున్సిపల్ బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు. పట్టణ ప్రజలు ర్యాలీలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ఉదయగిరి: మండలంలోని గ్రామ సచివాలయాల పరిధిలో యోగాంధ్రపై సచివాలయ సిబ్బంది సోమవారం అవగాహన ర్యాలీలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కాగా మంగళవారం ఉదయగిరిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాలలో ఎస్ఆర్ఐ శేగు సతీష్ సహకారంతో చెన్నై శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం కూడా కొనసాగింది. ఇప్పటి వరకు 353 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అందులో 73 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని వైద్యులు గుర్తించారు. ఈ నెల 14వ తేదీ వరకు వైద్యశిబిరం నిర్వహించనున్నారు. ఈ నెల 10వ తేదీ నుంచి ఆధునిక మొబైల్ వ్యాన్‌లో కంటి ఆపరేషన్లు చేయనున్నట్లు నిర్వాహకులు యల్లాల రఘురామిరెడ్డి తెలిపారు.



175 మందికి కంటి పరీక్షలు

జలదంకి: స్థానిక ఉన్నత పాఠశాల ఆవరణలో చాగణం లలితమ్మ, భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. తిరుపతికి చెందిన శ్రీవెంకటేశ్వర అరవింద్ నేత్రాలయకు చెందిన వైద్యులు మేఘనతో పాటు స్పెషలిస్టు డాక్టర్లు 175 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. 45 మందికి కంటి అద్దాలు అందజేశారు. కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించిన 35 మందికి ఉచితంగా చేయించనున్నట్లు ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ చాగణం గౌరీశంకర్, సీఈఓ సీతారాంనాయుడు తెలిపారు. ట్రస్టు ఏఓ అరవింద్, సిబ్బంది పాల్గొన్నారు.

కంపచెట్లను తొలగించరూ..

దగదర్తి: మండలంలోని ఉలవపాళ్ల గ్రామంలో రోడ్లను కంపచెట్లు ఆక్రమించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అల్లూరు రోడ్డు నుంచి ఉలవపాళ్ల గ్రామంలోకి వెళ్లేందుకు, వడ్డిపాళెం నుంచి, హిందూశ్మశాన వాటిక ద్వారా గ్రామంలోకి వచ్చే రోడ్లు కంపచెట్లతో మూసుకుపోవడంతో మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కంపచెట్లను తొలగించాలని పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి కంపచెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



సమాచార హక్కు చట్టం బోర్డులో మారని పేర్లు



ఉదయగిరి: మండల తహసీల్దార్ కార్యాలయంలోని సమాచార హక్కు చట్టం బోర్డులో నేటికి బదిలీపై వెళ్లిన అధికారుల పేర్లు, ఫోన్‌నంబర్లే దర్శనమిస్తుండడంతో ప్రజలు విస్తుపోతున్నారు. బోర్డులో పొందుపరిచిన పౌర సమాచార అధికారి, సహాయ పౌర సమాచార అధికారి, అప్పిలేటివ్ అధికారులు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో కొత్తవారు వచ్చారు. అయినా తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది బోర్డుపై దృష్టి సారించకపోవడంతో పాతపేర్లే దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమాచార హక్కు బోర్డులో పేర్లను మార్చాలని పలువురు కోరుతున్నారు.

ఆత్మకూరు మహిళకు గౌరవ డాక్టరేట్



ఆత్మకూరు: పట్టణానికి చెందిన గోర్సా జయ గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. దివంగత సీఎం వైఎస్సార్ స్ఫూర్తితో గోర్సా జయ తన సొంత నిధులతో పేదలకు అందిస్తున్న సేవలను గుర్తించి ఇంటర్నేషనల్ పీస్ వర్సిటీ జర్మని విభాగం వారు హైదరాబాదులో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో మాజీ మంత్రి, ప్రముఖ సినీనటుడు డాక్టర్ బాబుమోహన్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసినట్లు ఆమె తెలిపారు.